ఆడుతు పాడుతు పనిచేస్తుంటే..

- ఇక ఉపాధి పనుల జాతర
- ఏప్రిల్ నుంచి కూలీలకు మరింత భరోసా
- క్లస్టర్‌లో 16.01 లక్షల పనిదినాల కల్పనకు ప్రణాళిక



ఉపాధి హామీ పథకంలో పూడికతీత పనులు చేస్తున్న కూలీలు

రాయవరం: పల్లెకు పోదాం.. పనులు చేద్దాం చలో చలో అన్నట్లు గ్రామాల్లో ఇప్పటికే ఉపాధి హామీ పనుల జాతర కొనసాగుతోంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ పెద్దఎత్తున పనుల కల్పనకు ప్రభుత్వం సిద్ధమైంది. అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా ఉపాధి హామీ పనుల ప్రణాళికను ఇప్పటికే ఖరారు చేసింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులను జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) రూపొందించింది. ప్రజలు, కూలీల డిమాండ్ మేరకు ఆయా పనులను ప్రణాళికలో చేర్చి ఆయా గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఆమోదం పొందారు. ఆమోదం పొందిన పనులను మండల స్థాయిలో తీర్మానాలు చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలు, రైతులకు ఉపయోగపడే పనులకే ప్రాధాన్యం కల్పించారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని రామచంద్రపురం, కె.గంగవరం, మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, కాజులూరు మండలాల్లో ఉపాధి హామీ పనులకు ప్రణాళిక ఖరారైంది. క్లస్టర్ పరిధిలోని ఆరు మండలాల్లో మొత్తం 2,37,076 మంది కూలీలకు 16.01 లక్షల పనిదినాలు కల్పించాలనే లక్ష్యంగా అధికారులు ముందుకు సాగుతున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డుదారులకు భరోసా లభించనుంది. ముఖ్యంగా ఉపాధి హామీ కూలీలకు చేతినిండా పని కల్పించనున్నారు. 2022–23లో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని శత శాతం పూర్తి చేసే పనిలో అధికారులు ఇప్పటి నుంచే నిమగ్నమయ్యారు.

అదే సమయంలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు సన్నద్ధమవుతున్నారు. కరోనాతో తలెత్తిన పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో పనికావాలన్న ప్రతి ఒక్కరికీ ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో ఉపాధి కల్పించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఆ దిశగా అధికారులు అన్ని చర్యలు చేపట్టారు.

మండలం	ఉపాధి కూలీలు	పని దినాలు
కపిలేశ్వరపురం	28826	2,87,587
మండపేట	20312	2,20,149
రాయవరం	24532	2,86,816
రామచంద్రపురం	18233	2,30,745
కె.గంగవరం	21692	3,40,914
కాజులూరు	15629	2,35,443

ప్రయోజనకర పనులకే..

ఉపాధి హామీ పథకం కింద చేపట్టబోయే పనులు ఇటు ప్రజలు, అటు కూలీలకు ప్రయోజనం కలిగేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. ముఖ్యంగా గ్రామాల్లో చెరువుల పూడికతీత, పంట బోదెల తవ్వకం, ఆధునికీకరణ పనులు, ఇంకుడు గుంతల తవ్వకం, తాగునీటి కుంటలు, మైనర్, మేజర్ ఇరిగేషన్ కెనాల్స్, పశుగ్రాస పెంపకం, రహదారి నిర్మాణాలు, మొక్కలు నాటడం, పెంపకం, కచ్చా డ్రైన్ల ఏర్పాటు, బ్లాక్ ప్లాంటేషన్‌లో భాగంగా చెరువు గట్లపై కొబ్బరి మొక్కలు నాటడం, పూడికతీత, ఉద్యాన, పండ్ల తోటల సాగు వైపు రైతులను ప్రోత్సహించే పనులను చేపడతారు. వీటికే ఆమోదం తెలిపారు.

వంద శాతం పూర్తి చేస్తాం..



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి పని కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామసభల్లో గుర్తించిన పనులను వచ్చే ఆర్థిక సంవత్సరంలో వంద శాతం పూర్తి చేస్తాం. అడిగిన ప్రతి ఒక్కరికీ పథకం ద్వారా పని కల్పిస్తాం. –జనిపల్లి సుధారాణి, ఏపీఓ, ఎన్‌ఆర్‌ఈజీఎస్, రాయవరం

కమనీయం... శ్రీనివాసుని కల్యాణం



వేంకటేశ్వరస్వామివారి కల్యాణ వేడుకను నిర్వహిస్తున్న పండితులు



ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డిని సత్కరిస్తున్న బులిస్వామిరెడ్డి తదితరులు

మండపేట: అర్తమూరులో వేంచేసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయ 15వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణం కనుల పండువగా జరిగింది. శ్రీవారి భక్తమండలి చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకకు అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూజలు చేశారు. తొలుత మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చరణల నడుమ స్వామివారు, దేవేరుల ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డిని బులిస్వామిరెడ్డి ఘనంగా సత్కరించారు. ఉత్సవాల్లో భాగంగా సామూహిక కుంకుమార్చన, అనంతరం స్వామివారి రథోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. పటికబెల్లం, తులసీదళాలతో స్వామివారి తులాభారం నిర్వహించారు. వేడుకల్లో భాగంగా కర్రి శ్రీమహాలక్ష్మి, తమలంపూడి మహాలక్ష్మి, సత్తి మనీషా, శ్రీమన్నారాయణ రామానుజ స్వామివారి కోలాట బృందాల ఆధ్వర్యంలో కోలాట నృత్య ప్రదర్శనలు భక్తులను అలరించాయి. కర్రి బాపిరెడ్డి, ఉద్దగిరి ఆంజనేయులు, వెలగల శివారెడ్డి, సత్తి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం కర్రి బాపిరెడ్డి, మహాలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో స్వామివారికి సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించనున్నట్టు బులిస్వామిరెడ్డి తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పారదర్శకంగా రీ సర్వే పనులు చేయాలి



పాణింగపల్లిలో సర్వే రాళ్ల ఏర్పాటు ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీఓ సింధు

కె.గంగవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న భూ రక్ష పథకంలో భాగంగా జరుగుతున్న భూముల రీసర్వే పనులు నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని రామచంద్రపురం ఆర్డీఓ సింధు సుబ్రహ్మణ్యం రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మండలంలోని యండగండి, పాణింగపల్లి గ్రామాల్లో జరుగుతున్న సరిహద్దుల మధ్య సర్వే రాళ్ల ఏర్పాటు ప్రక్రియను శుక్రవారం ఆమె పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటికే మండలంలోని అన్ని గ్రామాలకు సర్వే రాళ్లు వచ్చాయని తెలిపారు. వీటిని ఆయా గ్రామాల్లో గల రెవెన్యూ సిబ్బంది నిబంధనల ప్రకారం సూచించిన చోట సర్వే రాళ్లు ఏర్పాటు చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వైద్యనాథ్ శర్మ, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

అవసరానికి మించి ఎరువులు వాడొద్దు



పొలంబడి కార్యక్రమంలో రైతులకు సూచనలు ఇస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

కె.గంగవరం: రైతులు అనవసరంగా ఎరువులు వాడి డబ్బులు వృథా చేసుకోవద్దని అవసరానికి మించి ఎక్కువగా ఎరువులు వాడితే నష్టం వస్తుందని జిల్లా వ్యవసాయాధికారి కె.నాగేశ్వరరావు రైతులకు సూచించారు. మండలంలోని పాణింగపల్లిలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరావు మాట్లాడుతూ మూడో కోట కింద రైతులు పొటాష్, యూరియా మాత్రమే వేసుకోవాలని అనవసరమైన కాంప్లెక్స్ ఎరువులు వాడొద్దన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో జరుగుతన్న జగనన్న భూ రక్ష పథకంలో భాగంగా సర్వే రాళ్లు ఏర్పాటు ప్రక్రియలో రైతులు భాగస్వామ్యులు కావాలని తెలిపారు. రైతులు తమ పంట భూముల వద్ద విలేజ్ సర్వేయర్, వీఆర్వోలతో మార్క్ చేయించుకుని అక్కడ సర్వే రాళ్లు పాతుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏడీఏ జయరామలక్ష్మి, ఏఓ బలుసు రవి, సర్పంచ్ చీకట్ల సునీత, సొసైటీ అధ్యక్షుడు అచ్యుతరామయ్య, నాయకులు గోపాలం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి ముందుకు రావాలి



కపిలేశ్వరపురంలో మాట్లాడుతున్న జిల్లా హౌసింగ్ అధికారి బాబూరావు

కపిలేశ్వరపురం: శాస్త్రీయ పద్ధతిని అవలంబిస్తూ పరిమిత ఖర్చుతో నాణ్యమైన ఇళ్లను నిర్మించుకునేందుకు లబ్ధిదారులు ముందుకు రావాలని జిల్లా హౌసింగ్ అధికారి చల్లా బాబూరావు కోరారు. మాచర, కపిలేశ్వరపురం జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన స్థలంలో ఇల్లు నిర్మాణం చేపట్టడంలో సాంకేతిక సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని హౌసింగ్, సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం, మెటీరియల్ సరఫరా తదితర అంశాలను హౌసింగ్ ఏఈ పీవీవీఎస్‌ఎస్ మూర్తి వివరించారు. మండలంలో 25 లేఅవుట్లలో 1,416 ఇళ్లు మంజూరయ్యాయని, ఇందులో 350 ఇళ్లు పూర్తి కాగా, మరో 302 ఇళ్లు పునాది దశలో ఉన్నాయన్నారు. పూర్తి చేసుకున్న వారిలో 90 శాతం మంది లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులు జరిగాయన్నారు. మిగిలిన 764 ఇళ్లు త్వరితగతిన నిర్మించుకోవాలని మండల ప్రత్యేకాధికారి ఎ.శాంతి అన్నారు. సమావేశంలో ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండపేటలో జేసీ పర్యటన

మండపేట: మండపేటలో జేసీ ధ్యానచంద్ శుక్రవారం పర్యటించారు. బైపాస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేయనున్న గ్యాస్ బంక్‌కు సంబంధించి స్థల పరిశీలన చేశారు. అలాగే న్యూ కాలనీలోని నివాస ప్రాంతంలో సర్వే నంబర్ నిషేధిత జాబితాలో చేర్చినట్టు లోకాయుక్తకు అందిన ఫిర్యాదుపై స్థలాన్ని పరిశీలించారు. అలాగే పట్టణంలో రీ సర్వే పురోగతి గురించి తహసీల్దార్ టీ రాజేశ్వరరావు, రెవెన్యూ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలను ఎదుర్కోండి



వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: పదవ తరగతి విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో పరీక్షలను ఎదుర్కోవాలని విద్యావేత్త, మోడరన్ కళాశాల ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని కేకేఎల్ కుమారి తనకు విద్య నేర్పిన గురువు, ప్రస్తుతం మోడరన్ కళాశాల ప్రిన్సిపాల్ అయిన వెంకటేశ్వర్లును పదో తరగతి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకు ఆహ్వానించారు. ఆయన విద్యార్థులకు పరీక్షలంటే భయం ఉండకూడదని, ఆత్మ విశ్వాసంతో, పట్టుదలతో, ప్రణాళికబద్ధంగా చదువుకుని పరీక్షల్లో రాణించాలని సూచించారు. ఒకరినొకరు అనుకరించకుండా పోటీతత్వం అలవర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల్లో స్ఫూర్తిని కలిగించిన వెంకటేశ్వర్లు, మరో విశ్రాంత అధ్యాపకుడు ఎం.నారాయణరావులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహాలక్ష్మి, రవి, జ్యోతిశ్రీ, రామలక్ష్మి పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతతో సంపూర్ణ జీవితం

అమలాపురం టౌన్: అమలాపురం రవణం వీధి గరిగుంట చెరువు వద్ద ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం అమలాపురం శాఖ ఆధ్వర్యంలో రూ. 3 కోట్లతో నిర్మించిన మెడిటేషన్ రిట్రీట్ సెంటర్ భవనంలో శుక్రవారం గృహ ప్రవేశం చేశారు. బ్రహ్మకుమారీస్ ఇంటర్నేషనల్ హెడ్‌క్వార్టర్స్ రాజస్థాన్ రాష్ట్రం మౌంట్ అబూ నుంచి ముఖ్య అతిథిగా హాజరైన ఆ సంస్థ రూరల్ వింగ్ నేషనల్ కోఆర్డినేటర్ బీకే రాజుభాయ్ ఈ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన బ్రహ్మకుమారీస్ సభలో రాజుభాయ్ మాట్లాడుతూ మనిషికి మానసిక ప్రశాంతతతోనే సంపూర్ణ జీవితం సాకారమవుతుందన్నారు. ఈ రిట్రీట్ సెంటర్ ద్వారా ఇక నుంచి కోనసీమ జిల్లా ప్రజలకు మానసిక ప్రశాంతత చేకూర్చే విధంగా ఆధ్యాత్మిక, ధ్యాన సేవలు అందుబాటులో వస్తాయన్నారు.

వేర్వేరు కేసుల్లో ముగ్గురికి జైలు

అమలాపురం రూరల్: అమలాపురం తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో జరిగిన మూడు వేర్వేరు కేసుల్లో ముగ్గురికి స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎస్.శ్రీనివాస్ జైలు శిక్షలు విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. వీటికి సంబంధించి తాలూకా ఎస్సై ఎ.పరదేశి తెలిపిన కథనం ప్రకారం.. కోర్టులో అటెండర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి మలికిపురం మండలం మోరికి చెందిన దేశినీడి శ్రీనివాసరావు బండారులంకకు చెందిన లక్కింశెట్టి గురురాఘవేంద్రతో పాటు 11 మంది నుంచి రూ.8,47,500 తీసుకుని మోసం చేశాడన్నది అభియోగం. 2014లో జరిగిన ఈ మోసంపై అప్పటి తాలూకా ఎస్సై కె.సుధాకర్ కేసు నమోదు చేశారు. కోర్టులో ఈ కేసుకు సంబంధించి శుక్రవారం జరిగిన తుది విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడు శ్రీనివాసరావుకు ఆరు నెలల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.200 జరిమానా విధించారు.

చోరీ కేసుల్లో..

గత ఏడాది ఆగస్టు 1న జనుపల్లిలో గూడూరు సురేష్ ఇంటి వద్ద ఉన్న బైక్‌ను కొత్తపేట మండలం మందపల్లికి చెందిన ఏసుకోన రామకృష్ణ దొంగిలించాడు. ఈ నేరం రుజువు కావడంతో నిందితుడికి ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధించారు. సవర్పాలెంలో గత ఏడాది జూలై 23న కె.రమణకు చెందిన బైక్‌ను చల్లపల్లికి చెందిన మద్దెల చంటిబాబు చోరీ చేశాడు. నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష పడింది.

క్లుప్తంగా

రైతు భరోసా లబ్ధిదారుల జాబితా ప్రదర్శన



రైతు భరోసా కేంద్రం వద్ద లబ్ధిదారుల తుది జాబితా ప్రదర్శిస్తున్న ఏఓ సత్యప్రసాద్

రామచంద్రపురం రూరల్: ఈ నెల 27 న మూడో విడత డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ లబ్ధిదారుల తుది జాబితాను సోషల్ ఆడిట్ నిమిత్తం అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శనకు పెట్టినట్లు మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. అర్హుల జాబితాల్లో ఏమైనా పొరపాట్లు ఉంటే తమకు తెలియజేయాలని ఏఓ కోరారు. అదే విధంగా మండలంలో 2022 రబీ పంటకు సంబంధించి పంట నమోదు, ఈ–కేవైసీ నమోదు చేయించుకోనివారు ఇంకా 2 వేల మంది ఉన్నారని వారు నేటి సాయంత్రం లోగా నమోదు చేయించుకోవాలని సూచించారు.

స్కాలర్‌షిప్‌కు విద్యార్థిని ఎంపిక



లలితను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తదితరులు

మండపేట: సంతూర్ సంస్థ అందించే ఉపకార వేతనానికి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ మొదటి సంవత్సరం చదువుతున్న రెడ్డి లలిత ఎంపికైంది. ఏడాదికి రూ. 24 వేల చొప్పున నాలుగేళ్ల పాటు ఆ సంస్థ లలితకు స్కాలర్‌షిప్ అందజేస్తుందని శుక్రవారం ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు తెలిపారు. ఆమెను ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, లెక్చరర్లు కేఎస్ఆర్ కిరణ్‌కుమార్, గోపాలకృష్ణ, ఆనంద్, త్రినాథ్ తదితరులు అభినందించారు.

ఘనంగా శ్రీకంఠ రుషి జయంతి



శ్రీకంఠ రుషి ఆశ్రమంలో పూజలు చేస్తున్న భక్తులు

కాజులూరు: గొల్లపాలెం గ్రామ శివార్లలోని గాయత్రినగర్ శ్రీకంఠ రుషి ఆశ్రమంలో శుక్రవారం శ్రీకంఠ జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ కార్యశర్మి శివశ్రీ శంకరప్రియ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలలో పూజ్యం నాగేశ్వరశర్మ తదితర వేద పండితులు పాల్గొని ఉదయం నుంచి విఘ్నేశ్వరపూజ, గురుమండలార్చన, మహాగణపతి, గాయత్రి, సరస్వతీ పూజలు, కుంకుమార్చనలు, ధన్వంతరీమూర్తుల మూలమంత్రానుష్టానము, నివేదన, నీరాజనం, పండిత సత్కారాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఆశ్రమ నిర్వాహక కమిటీ సభ్యులు అన్నసమారాధన నిర్వహించారు. కాజులూరు, కరప మండల గ్రామాలకు చెందిన ఆధ్యాత్మిక వేత్తలు, పండితులు పాల్గొన్నారు.

బీజేపీ కిసాన్ మోర్చా సమావేశం

రామచంద్రపురం రూరల్: బీజేపీ కిసాన్ మోర్చా రూరల్ మండల అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం కిసాన్ మోర్చా సమావేశం వెలంపాలెంలో నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల సత్యనారాయణ, ట్రేడర్స్ సెల్ జిల్లా కన్వీనర్ కొట్టువాడ హరిబాబు, బిల్డింగ్ వర్కర్స్ సెల్ జిల్లా కన్వీనర్ అల్లం రామకృష్ణ, మండల ఉపాధ్యక్షుడు వెన్నపు ధనరాజులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న పలు పథకాలను వివరించారు. కార్యక్రమంలో మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు వాసంశెట్టి రాజేశ్వరి, కె.గంగవరం మండల అధ్యక్షుడు ఏవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మసీదుల అభివృద్ధికి కృషి



కొత్తలంక బాబా దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఖాదర్ తదితరులు

ముమ్మిడివరం: కొత్తలంక హజరత్ సయ్యద్ అహమ్మద్ అలీషా ఖాద్రీ వలీబాబా దర్గాను కోనసీమ జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ ఖాదర్, వక్ఫ్ బోర్డు సభ్యులు శుక్రవారం సందర్శించారు. దర్గాలో జియారత్ చేసుకుని బాబా ఆశీస్సులు పొందారు. తొలిత సభ్యులకు దర్గా ముజావర్ గేదెల రఘునాథ్‌బాబా, శివ, తాజుద్దీన్ స్వాగతం పలికారు. దర్గా వద్ద మసీదు నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. చైర్మన్ ఖాదర్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో దాతల సహకారంతోమసీదు నిర్మాణం చేపడతామన్నారు. జిల్లాలో మసీదులు, దర్గాలను మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

27 నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

కపిలేశ్వరపురం: మండలంలోని వెదురుమూడి, తాతపూడి గ్రామ సచివాలయాల్లో ఈ నెల 27 నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలను నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం నుంచి రెండు రోజుల పాటు ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో ప్రత్యేక శిక్షణ పొందిన ఇనుమర్తి వీర మల్లేశ్వరరావు, కోరా దొరబాబులు ప్రజల ఆధార్ కార్డులను నవీకరణ చేస్తారన్నారు. ఆధార్ కార్డులోని వేలి ముద్రలు, ఫోటో, ఐరిస్‌లతో పాటు పేరు, చిరునామా తదితర వివరాలను నవీకరించుకోవచ్చని ఎంపీడీఓ తెలిపారు.

జగనన్న కాలనీలో మెరక పనులు

కపిలేశ్వరపురం: నేలటూరు జగనన్న కాలనీలోని రెండో లేఅవుట్‌లో శుక్రవారం మెరక పనులు చేపట్టారు. ఈ పనులను సర్పంచ్ కుక్కల వీరన్న, ఎంపీటీసీ సభ్యురాలు రుద్రాక్షుల వీరగౌరీ కుమారి, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ నిమ్మకాయల పద్మరాజు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో లేఅవుట్లను రూ.17.52 లక్షలతో మెరక చేస్తున్నామన్నారు.

రోగులకు వైద్య సేవలు

కపిలేశ్వరపురం: నిడసనమెట్టలో 80 మందికి అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి కరుణేంద్రకుమారి వైద్య సేవలందించారు. ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా వృద్ధులు, చిన్నారులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. పోషకాహారం ప్రాధాన్యాన్ని వివరించారు. ఎంపీహెచ్‌ఎస్ ఎస్.నూకరాజు, ఆరోగ్య కార్యకర్త పేరూరు విజయదుర్గ, ఆశ కార్యకర్తలు వై.మీరమ్మ, బోణం నాగలక్ష్మి, 104 డీఈఓ ప్రసాద్ పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కె.గంగవరం: ఈ నెల 27వ తేదీలోపు ఓపెన్ ఇంటర్ చదివే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పామర్రు జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ ఏ అంజిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పది ఉత్తీర్ణులై, ఇంటర్‌లో చేరనివారు, ఇంటర్ మధ్యలో చదువు మానేసిన విద్యార్థుల కోసం బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ (ఏపీఓఎస్ఎస్) ద్వారా చదువుకునేందుకు అవకాశం ఉందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు పామర్రు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

కుష్ఠు బాధితుల సమస్యలు పరిష్కరించాలి

మండపేట: కుష్ఠు బాధితుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లెప్రసీ హక్కుల పోరాట సమితి కోరింది. శుక్రవారం స్థానిక దివ్యాంగుల భవనంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లెప్రసీ హక్కుల పోరాట సమితి సమావేశం జరిగింది. మహాజన సోషలిస్టు పార్టీ నాయకుడు దూలి జయరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి సంఘం నాయకులు అంబటిపాటి శంకర్, జొన్నకూటి సుధాకర్, కడియాల చంద్రరావు, గంటా సత్యానందం తదితరులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులకు పింఛన్ సాయం రూ.10 వేలకు పెంచాలని, నిబంధనలు లేకుండా 35 కిలోల బియ్యం ఇవ్వాలని, వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే నబీ, నురుకుర్తి లోవరాజు, మేడిశెట్టి రాంబాబు, కాళిదాసు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.